జనం వార్త





# ఓం నమః శివాయ

- శివనామస్మరణతో మారు మోగిన కీసరగుట్ట క్షేత్రం
- శివరాత్రి రోజు కీసర గుట్టకు పోటెత్తిన భక్త జనం
- గంటల తరబడి క్యూలైన్లో వేచి ఉండి శివ దర్శనం చేసుకున్న భక్తులు
- మహాదేవుని దర్శించుకున్న మంత్రులు, గవర్నర్, ఎం.పి., ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు
- ట్రాఫిక్ జామ్ తో ఇబ్బందులు పడ్డ భక్తులు
- పార్కింగ్ సమస్యలు సరే సరి









**మేడ్చల్ :** మహాశివరాత్రి పర్వదినోత్సవం సందర్భంగా కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దేవాలయం ఓం నమః శివాయ అంటూ శివనామస్మరణతో మారుమోగిపోయింది. మహా శివరాత్రిని పురస్కరించుకుని భక్తులు వేలాది మంది ఆదివారం మహాదేవుని దర్శనం కోసం కీసర గుట్టకు పోటెత్తారు. వందలు, వేలుగా భక్తులు గంటల తరబడి క్యూలైన్లో నిలబడి, ఆలస్యమైనా శ్రీభవానీ రామ లింగేశ్వర స్వామి వారిని దర్శనం చేసుకుని భక్తి పారవశ్యంతో పులకరించి పోయారు. ఈ నేపథ్యంలో కీసరగుట్ట పుణ్య క్షేత్రం భక్త కోటి సందడితో కిటకిట లాడిపోయింది. భక్తులు ఆలయ పరిసర ప్రాంతాలలో ఉన్న శివలింగాలకు భక్తితో అభిషేకాలు నిర్వహించి, తరించి పోయారు.

**పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన ఐ.టి శాఖ మంత్రి శ్రీధర్ బాబు దంపతులు :** కాగా, మహాశివరాత్రిని పురస్కరించుకొని శనివారం రాత్రి రాష్ట్ర ఐ.టి మినిస్టర్ జిల్లా ఇన్చార్జి మినిస్టర్ దుద్దిల్ల శ్రీధర్ బాబు రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామి వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి శ్రీధర్ బాబు సతీ సమేతంగా స్వామివారి కల్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం బ్రహ్మ ముహూర్తం నుంచే అర్చకులు శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామివారికి అభిషేకాలలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి వారిని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మల్కాజిగిరి ఎం.పి ఈటెల రాజేందర్, ఎస్టీ కమిషన్ జాతీయ సభ్యులు హుస్సేన్ నాయక్, అనేక మంది ప్రజాప్రతినిధులు అలాగే, పలువురు సీనియర్ జడ్జిలు, అధికారులు, అనధికారులు రామ లింగేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ, అర్చకులు వారికి సాధారణంగా స్వాగతం పలికారు.

**ఇబ్బందులు పడ్డ భక్తులు :**

ఇదిలా ఉండగా, రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కు కీసరగుట్ట క్షేత్రం అతి సమీపంలో ఉన్నందున ప్రతియేటా ఈ క్షేత్రానికి వస్తున్న భక్తుల సంఖ్య వందలు, వేలు, లక్షలకు పెరుగుతోంది. ఫోర్ వీలర్లు, ఆటోలు, టు వీలర్స్ సంఖ్య పెరిగి ట్రాఫిక్ సమస్యలు ఎదు-రవుతున్నాయి. కిలోమీటర్ల మేరకు వాహనాలు నిలిచి పోతున్నాయి. కీసర నుంచి గుట్ట పైనకు పోవడానికి రెండు, మూడు గంటలు పడుతున్నది. మూడు, నాలుగు చోట్ల వాహనాలకు పార్కింగ్ ఏర్పాట్లు చేసినా సరిపోవడం లేదు. రోడ్లు విస్తరణ చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ విషయం తెలిసినా ఇటు ఆలయ కమిటీ, గానీ అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదు. దీనితో ప్రతి ఏటా ఇదే పరిస్థితి ఏర్పడుతోంది. అలాగే, లక్షలాదిగా వచ్చే భక్తులకు క్యూ లైన్లు సరిపోవడం లేదు. గంటల తరబడి భక్తులు క్యూ లైన్లలో నిలబడాల్సి వస్తున్నది. కిక్కిరిషే భక్తులకు క్యూ లైన్లో గాలి, నీరు, వెలుతురు అందక సీనియర్లు ఊపిరాడక మూర్చ వచ్చి పడిపోతున్నారు. క్యూ లైన్లో వచ్చే భక్తులతో రాంగ్ రూట్లో వచ్చే భక్తులు ఎదురుపడి లైన్లలోనే తోపులాటలు చోటు చేసుకుంటున్నాయి. భక్తులు ఒత్తిడికి లోనవుతున్నారు. తీరా దైవ దర్శనం చేసుకునే సమయంలో భక్తులను వాలంటీర్లు తొందర పెడుతూ గుంజివేస్తున్నారు. తనివితీరా దైవ దర్శనం చేసుకోలేని, మొక్కుకోలేని పరిస్థితిని కల్పిస్తున్నారు. ఇక భక్తులు హుండీలో కానుకలు వేయటానికి సమయం ఎక్కడుంటుంది. ఇటువంటి పరిస్థితుల్లో ఆలయానికి కానుకలు కూడా ఎక్కువగా పడటం లేదు. ఇది ప్రతి సంవత్సరం జరుగుతున్నదే. ఈ విషయంలో ఆలయ కమిటీ ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది.

**అధికమవుతున్న పోలీస్ శాఖ జోక్యం:**

ఇక శివరాత్రి సందర్భంగా ఆయలం వద్ద పోలీస్ శాఖ జోక్యం అధికంగా ఉంటుందన్న విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఇది భక్తులకు ఇబ్బందిగా మారుతున్నది. ఆలయ కమిటీ జారీ చేస్తున్న పాసులు సాధారణ భక్తులకు సమస్యగా మారుతున్నాయి. దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కీసర గుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయం అభివృద్ధికి, కీసర గ్రామం భక్తి పారవశ్యంతో పరవశించేలా, పరిఢవిల్లేలా చేయడానికి ఎన్నో అవకాశాలు, అవసరం ఎంతైనా ఉంది. దీనికి సంబంధించి, ప్రణాళికనే లేకుండా పోయింది.







